
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## ఇది ప్రజా ఆకాంక్షల బడ్జెట్: ఎంపీ వేమిరెడ్డి హర్షం

అభివృద్ధి, సంక్షేమాల కలయికతో రాష్ట్ర పునఃనిర్మాణం

ముఖ్యమంత్రికి, ఆర్థిక మంత్రికి ధన్యవాదాలు



**నెల్లూరు రూరల్, ఫిబ్రవరి14 ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 202627 వార్షిక బడ్జెట్ అద్భుతంగా ఉందని, ఇది రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబిస్తోందని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కొనియాడారు. రాష్ట్ర పునఃనిర్మాణమే లక్ష్యంగా, రూ. 3.32 లక్షల కోట్ల భారీ అంచనాతో ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్, అభివృద్ధిసంక్షేమాల మధ్య సమతుల్యతను సాధించిందని ఆయన పేర్కొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయం బడ్జెట్ కేటాయింపులపై ఎంపీ వేమిరెడ్డి స్పందిస్తూ, ఈ పద్దు కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని అభివర్ణించారు.

**ముఖ్యంగా విద్యకు పెద్దపీట :** విద్యాశాఖకు రూ. 32,000 కోట్లు కేటాయించడం భావి తరాల పట్ల ప్రభుత్వానికి ఉన్న బాధ్యతను చాటిచెబుతోంది.

**గ్రామీణ వికాసం :** పంచాయతీ రాజ్ శాఖకు రూ. 23,000 కోట్లు కేటాయించడం ద్వారా గ్రామీణ ముఖచిత్రం మారనుంది.

**మౌలిక సదుపాయాలు :** రోడ్లు, పోర్టులు, మరియు విద్యుత్ రంగాలకు భారీ నిధులు కేటాయించడం ద్వారా పారిశ్రామికాభివృద్ధికి బాటలు పడ్డాయి.

**నెల్లూరు జిల్లా రైతులకు వరం** వ్యవసాయంపై ప్రధానంగా ఆధారపడిన నెల్లూరు జిల్లాలో లక్షలాది మంది రైతులకు ఈ బడ్జెట్ ఎంతో మేలు చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సాగునీటి ప్రాజెక్టులు, వ్యవసాయ అనుబంధ రంగాలకు ఇచ్చిన ప్రాధాన్యత రైతు లోకానికి వెన్నుదన్నుగా నిలుస్తుందన్నారు.

"సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతుల్యత సాధించడం ఒక కళ అయితే... ఈ బడ్జెట్ ఆ కళను అత్యున్నత స్థాయిలో ఆవిష్కరించింది." వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎంపీ.

**కీలక ప్రాజెక్టులకు జవజీవాలు** రాష్ట్ర జీవనాడి పోలవరం, రాజధాని అమరావతి నిర్మాణాలకు ఈ బడ్జెట్‌లో అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం శుభపరిణామమని వేమిరెడ్డి అన్నారు. గ్రామీణ ప్రగతి నుంచి పట్టణ ప్రణాళిక వరకు, ప్రతి రంగంలోనూ సమగ్ర దృష్టితో ఈ ప్రజాహిత పద్దు రూపొందిందని ఆయన ప్రశంసించారు.

**అద్భుతమైన బడ్జెట్‌ను** అందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మరియు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్లకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## జిల్లా ప్రజలపై మహాశివుని ఆశీసులు మెండుగా ఉండాలి



**నెల్లూరు రూరల్, ఫిబ్రవరి14 ప్రభాతవార్త** శివం అంటే చైతన్యమని, శివుడు లింగాకారంలో ఉద్భవించిన పవిత్ర దినం మహాశివరాత్రి సందర్భంగా నెల్లూరు జిల్లా ప్రజలకు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా, కోవూరు ప్రజలపై మహా శివుని ఆశీస్సులు మెండుగా ఉండాలన్నారు. "ఓం నమశ్శివాయ" మంత్రోచ్చారంతో మన హృదయాలు పావనంగా మారాలన్నారు. అభిషేక ప్రియుడైన శివుడు ఆది దేవుడని కోరిన వరాలిచ్చే భోళా శంకరుడి అనుగ్రహంతో ప్రజల జీవితాలు ఆనందమయం కావాలని ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. శివరాత్రి నాడు భక్తి శ్రద్ధలతో జాగరణ చేసి పరమేశ్వరుడిని ఆరాధించాలని కోరారు. శివతత్వం సర్వ మానావాళికి సదా అనుసరణీయమని ఆయన పేర్కొన్నారు. శుభాలు కలిగించే ఆ శంకరుడి అనుగ్రహంతో నెల్లూరు జిల్లా పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

## శ్రీశ్రీశ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్న

శ్రీశ్రీశ్రీ త్రిదండి అహోబలం రామానుజ స్వాములవారు



**బుచ్చి ఫిబ్రవరి 14 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలోని శ్రీ కళ్యాణ వేంకటేశ్వం స్వామి వారిని అహోబలం రామానుజస్వాము ల వారు దర్శించుకున్నారు.ఆలయ కమీటి వారు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేకంగా పూజలు నిర్వహించి స్వామి వారి ప్రసాదాలు అందజేశారు. ఈకార్యక్రమంలో కమీటి వారు తదితరులున్నారు.

## మాజీ మంత్రి అనిల్ కుమార్ పై ఇన్‌చార్జ్ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ ఫైర్

నెల్లూరు వచ్చి నేరుగా రాజకీయం చేయ్యి...వెనకుండి డ్రామాలు వద్దు స్ట్రెయిట్ వార్నింగ్

మేయర్ నోటిఫికేషన్ పేరుతో మాజీ మేయర్ దంపతులను పావులుగా వాడుకుంటున్న డ్రామాలు ప్రజలకు తెలుసు

మేయర్ రాజీనామా చేసే డిప్యూటీ మేయర్ ఇన్‌చార్జ్‌గా ఉండటం కూడా తెలియకపోవడం మీ అవివేకం

కష్టాల్లో ఉన్న క్యాడర్‌ను వదిలేసి విదేశాల్లో వ్యాపారాలు చేసుకుంటున్నావు అని ఆరోపణలు



**నెల్లూరు కార్పోరేషన్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :**నెల్లూరు కార్పోరేషన్ వేదికగా మాజీ మంత్రి అనీల్‌కుమార్ యాదవ్‌ను టార్గెట్ చేస్తూ ఇన్‌చార్జ్ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ నిప్పులు చెరిగారు. శనివారం మేయర్ చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌చార్జ్ మేయర్ మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు కోట్లు గడించి కష్టాల్లో ఉన్న క్యాడర్‌ను నడిరోడ్డుపై వదిలేసి, ఇప్పుడు విదేశాల్లో వ్యాపారాలు చేసుకుంటూ నెల్లూరులో చిల్లర రాజకీయాలు చేయడం నీ పిరికితనానికి నిదర్శనం అంటూ ఆరోపణలు చేస్తూ ఘాటుగా విమర్శించారు. మాజీ మేయర్ పొట్లూరి స్రవంతి వెనుక ఉండి వైసిపి నేతలే డ్రామాలు ఆడిస్తున్నారని ఆరోపించారు. అవిశ్వాస తీర్మాణం అప్పుడు ఆమె తమ పార్టీ కాదన్న నేతలు, ప్రస్తుతం ఎలా మద్దతిస్తున్నారని ప్రశ్నించారు. కౌన్సిల్ సమావేశాల్లో పేరుతో లక్షల రుపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేశారని ఆరోపించారు. ఓటమి భయంతో నరసారావుపేటకు పారిపోయిన అనిల్‌కు నెల్లూరు పౌరుషం గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. దమ్ముంటే నేరుగా నెల్లూరుకు వచ్చి రాజకీయాలు చేయ్యి వెనకుండి కుతంత్రాలు చేయడం మానుకో అంటూ రూప్‌కుమార్ యాదవ్ బహిరంగ సవాల్ విసిరారు.

## రమణారెడ్డి మృతి మృతి పై దర్యాప్తు వేగవంతం



**చిలకూరు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త** మండల పరిధిలోని రెట్టపల్లి గ్రామం చెందిన వేదం రమణారెడ్డి మృతి పై దర్యాప్తు వేగవంతం చేయడం జరుగుతుందని జిల్లా అడిషనల్ ఎస్పీ సౌజన్య అన్నారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ రమణారెడ్డి అనుమానస్పదంగా మృతి చెంది ఉండటాన్ని ఎస్సై, సీఐలు గుర్తించడం జరిగిందని వారు తెలిపారు. అయితే రమణారెడ్డి తలపై తీవ్రరక్త గాయాలు ఉండడంతోపాటు చేతికి ఉన్న బంగారం ఉంగరం కనిపించకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్న అన్నారు. దీంతో దర్యాప్తు నిర్వహించి అనుమానితులను అదుపులో తీసుకొని విచారించడం జరుగుతుంది అన్నారు. బంగారు ధరించి ఒంటరిగా తిరగరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు డిటిసి డిఎస్పి గిరిధర్, సిఐలు సుబ్బారావు, శేఖర్ బాబు, ఎస్ఐ సురేష్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాలు ఢీ : ఒకరు మృతి,మరొకరి పరిస్థితి విషమం



**బిట్రగుంట ఫిబ్రవరి 14 ప్రభాతవార్త** బోగోలు మండలం కప్పరాల తిప్ప బోగోలు మధ్య శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు మృతి చెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. బిట్రగుంట ఏఎస్ఐ కోటేశ్వరరావు కథనం మేరకు కప్పరాలతిప్ప కు చెందిన కుంచాల సాల్మన్, మనోహర్ అ ఖిల్ తో కలిసి బోగోలు నుండి కప్పరాలతిప్పకు బుల్లెట్ వాహనంపై వస్తున్నాడు. అదే క్రమంలో విశ్వనాథరావుపేట కు చెందిన జస్టిస్ ఫ్రాన్సిస్ ప్రైవేట్ ఫ్యాక్టరీలో విధులు ముగించుకుని విశ్వనాథరావుపేటకు వస్తుండగా ఎదురెదురుగా రెండు మోటార్ సైకిల్ ఢీకొని కుంచాల సాల్మన్(23) మృతి చెందగా జస్టిస్ ఫ్రాన్సిస్ కు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనం ద్వారా కావలి ఏరియా వైద్య శాలకు తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో నెల్లూరులోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించినట్లు ఏఎస్ఐ తెలిపారు. ఈ క్రమంలో అఖిల్,మనోహర్ స్వల్ప గాయాలతో బయటపడ్డ పేర్కొన్నారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కండలేరులో 56.640 టీయంసీల నీటిమట్టం



**రాపూరు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** మండలంలోని కండలేరు జలాశయంలో శనివారం ఉదయానికి 56.640 టీయంసీల నీటిమట్టం నమోదు అయినట్లు కండలేరు ఎఇ అనీల్ కుమార్ తెలిపారు. జలాశయం నుండి హైలెవల్ కెనాల్ ద్వారా 240 క్యూసెక్కులు, లోలెవల్ స్లూయిస్ ద్వారా 200 క్యూసెక్కులు,కండలేరు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 1340 క్యూసెక్కుల చోప్పున మొత్తం 1780 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఆయన తెలిపారు.

## పరిశ్రమల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాం

జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

బోగోలు తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్





**బిట్రగుంట ఫిబ్రవరి 14 ప్రభాతవార్త** జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. శనివారం బోగోలు తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. బోగోలు తహసీల్దార్ కార్యాలయంలో భూముల రీసర్వే పురోగతి, మూడు నెలల క్రితం రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ అధికారులకు అధికారాలను బదలాయిస్తూ జారీ చేసిన ఉత్తర్వులపై జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో అనేక పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని, ఇందుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. పరిశ్రమలు ఏర్పాటుతో అభివృద్ధితోపాటు యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయి అన్న కలెక్టర్, ఈ దిశగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నట్టు చెప్పారు. పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వస్తున్న పారిశ్రామికవేత్తలకు పూర్తి సహాయ సహకారాలు ప్రభుత్వం తరఫున అందిస్తున్నట్లు చెప్పారు. ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన తాజా ఉత్తర్వులపై రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించుకుని, ప్రజల రెవెన్యూ సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. మండలంలో భూముల రీసర్వే ప్రక్రియను మరింత వేగవంతం చేసి, పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. మండలంలోని బిట్రగుంట రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే పరిధిలో సుమారు 500 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నదని, రైల్వే అధికారులతో చర్చించి ఆ భూమిని భవిష్యత్తులో పారిశ్రామిక అవసరాలకు వినియోగించే దిశగా చర్యలు చేపట్టే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. మండలంలో పరిశ్రమల ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. మండలంలో పరిశ్రమల స్థాపనకు అందుబాటులో ఉన్న భూముల వివరాలు, అవకాశాలపై తహసీల్దార్‌తో చర్చించినట్లు వెల్లడించారు. అక్రమ రేషన్ బియ్యం రవాణా, అక్రమ మైనింగ్ కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించామని, వీటిని పూర్తిగా కట్టడి చేయడానికి జిల్లా ఎస్పీతో కూడా చర్చలు జరిపినట్లు తెలిపారు. తొలుత మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి కలెక్టర్ నివాళులర్పించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి సహా సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నెల్లూరును దోమలరహిత నగరంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం మంత్రి నారాయణ

- 50 కోట్లతో కాలువల ఆధునీకరణ
- ముంపు ముప్పుకు శాశ్వత పరిష్కారం
- అభివృద్ధిలో రాజీ పడే ప్రసక్తే లేదు
- ఖజానా ఖాళీగా ఉన్నా అభివృద్ధిలో రాజీ పడం మంత్రి స్పష్టం



**నెల్లూరు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త-వైద్యం :** నెల్లూరు నగరంలోని 47 వ ములుముడి బస్టాండ్ సెంటర్ హనుమాయమ్మ సందు మరియు 48వ డివిజన్‌లలో మంత్రి నారాయణ శనివారం రాత్రి పర్యటించి, రోడ్డు మరియు ఉయ్యాల కాలువ ఆధునీకరణ పనులను పరిశీలించారు.అభివృద్ధికి పాటుపడుతున్న మంత్రికి స్థానికులు బ్రహ్మరథం పట్టారు .ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ నెల్లూరును దోమలరహిత నగరంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని, 2017లో ఎదురైన ముంపు ముప్పు పునరావృతం కాకుండా రూ. 50 కోట్లతో 8 ప్రధాన కాలువల పనులను శరవేగంగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఎవరికీ ఇబ్బంది కలగకుండా డిజైన్లలో మార్పులు చేశామని, ఒకవేళ ఎవరికైనా ఇబ్బంది కలిగితే ప్రత్యామ్నాయం చూపిస్తామని హామీ ఇచ్చారు .నగర అభివృద్ధికి ఆక్రమణదారులు సహకరించాలని కోరారు. ఖజానా ఖాళీగా ఉన్నా అభివృద్ధి విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ నందన్, డిప్యూటీ మేయర్ తహసీన్ ఇంతియాజ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్ళపాక అనూరాధ, విజేతా రెడ్డి, పొట్లూరు రామకృష్ణ, ధర్మవరపు గణేష్, శ్రీమంతుల కిషోర్ మరియు ఇతర టీడీపీ ముఖ్యనేతలు పాల్గొన్నారు.



## నడి రోడ్డులో... లక్కీడ్రా.. ఎంది గురూ..?

- యాంకర్ల హంగామా
- స్తంభించిన ట్రాఫిక్
- ప్రయాణికుల అవస్థలు



**పొదలకూరు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త** పొదలకూరు పట్టణంలో ఒక గ్రాఫిక్స్ మొబైల్స్, హోమ్ నీడ్ వ్యాపార దుకాణంలో లక్కి డ్రా పేరు మీదు నానా హంగామా శనివారం చేసారు. దీంతో ట్రాఫిక్ మొత్తం స్థంభించిపోయింది. దుకాణ దారుడు లక్కి డ్రా ప్రేమికుల దినోత్సవం రోజు అని ప్రకటించి యాంకర్లతో మైక్ అన్సౌమెంట్ చేస్తూ ఈ రోజు దుకాణం ఎదురుగా హంగామా సృష్టించారు. పట్టణం నడిరోడ్లో పొట్టి శ్రీరాముల విగ్రహానికి ఎడమ చేతి పక్కన ఉన్న ఈ దుకాణం ప్రధాన రహదారికి అనుకోని ఉండడంతో వేలాది మంది ఈ లక్కి డ్రాలో పాల్గొనడంతో ట్రాఫిక్ స్థంభించిపోయింది. సాయంత్రం సమయం కావడంతో పాఠశాలలు, కాలేజీలు బస్సులు రాకపోకలు ఆగిపోయాయి. నిత్యం రద్దీగా తిరుగుతున్న ఆర్టీసి బస్సుల సైతం స్తంభించిపోయాయి. ఫిబ్రవరి 14 ప్రేమికుల దినోత్సవం సందర్భంగా డ్రా లో భారీ ఆఫర్‌లు అంటూ దుకాణాదారుడు ప్రకటించడంతో ప్రయాణికులు, వాహనాలు ఎక్కడికక్కడ పూర్తిగా స్తంభించిపోయాయి. ఈ దుకాణాదారుడు అతి స్వల్ప కొనుగోలుతో భారీ ఆఫర్లు అంటూ ప్రచారం ముమ్మరం చేయడంతో వినియోగదారులు ఆశపడి ఎగబడ్డారు. దుకాణాదారుడు ఎటువంటి అనుమతులు పొందకుండా నడిరోడ్లో ఈ లక్కి డ్రా యాంకర్లతో హంగామ చేస్తున్న పోలీసులు కానీ.. అధికారులు కానీ.. స్పందించకపోవడం చర్చనీయాంశం అయ్యింది. గతంలో కూడా ఈ దుకాణాదారుడు అధికారులను ప్రలోభపరచుకోవడంలో దిట్ట అని ఆరోపణలు ఉన్నాయి. ఈ రోజు దుకాణం ఎదురుగా వందలాది మంది గుమ్మికూడినా, వాహనాలు స్తంభించిపోయినా.. పోలీసులు మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం పై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో ఈ దుకాణ దారుడు ఇలాగే ఆఫర్‌ల పేరుతో ఎంతోమంది మభ్య పెట్టి మోసం చేసాడనే విమర్శలు సైతం ఉన్నాయి. ఇదిలా ఉంటే పట్టణంలో ప్రధాన రహదారి, బస్టాండ్ కూడలి సెంటర్‌లో జరిగిన ఈ ఉధంతం పై పోలీసులు స్పందించకపోవడంతో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అనుచరుడు దుకాణదారుడు అనే విమర్శ స్థానికుల్లో ఉంది. ట్రాఫిక్ పూర్తిగా స్తంభించినా సర్కిల్ పోలీస్ స్టేషన్ ఉన్న పొదలకూరులో ఒక్క పోలీసు సైతం ట్రాఫిక్‌ను క్రమబద్ధికరించేందుకు నియమించకపోవడం లక్కి డ్రాకు మాకు సంబంధం లేదని వ్యవహరించడం చర్చనీయాంశకమైనది. ఏది ఏమైనా నడి రోడ్లో లక్కి డ్రా నిర్వహించడం ఏందంటూ పలువురు చర్చించుకుంటున్నారు. జిల్లా అధికారుల సైతం ఈ విషయమై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుకుంటున్నారు.

## భక్తులకు ఇబ్బందులు లేకుండా భద్రత కల్పించాలి

ఎస్పీ డా.అజిత వేజెండ్ల



**కొడవలూరు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** మండలం గండవరం గ్రామం లో వెలసియున్న శ్రీ గంగా పార్వతి సమేత ఉదయ కాళేశ్వర స్వామి సన్నిధానంలో జిల్లా ఎస్పీ డా. అజిత వేజెండ్ల పాల్గొనడంతో ఆలయ అర్చకులు వేదమంత్రాలతో సాంప్రదాయంగా స్వాగతం పలికి పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ఆవరణంలో ఏర్పాట్లను ఎస్పీ పర్యవేక్షించారు.పరిసర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు సదుపాయాలతో పాటు, కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రూరల్ డిఎస్పి జి.శ్రీనివాసరావు, కొడవలూరు సిఐ సురేంద్రబాబు, ఎస్సై కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సీఎం పాలనా దక్షతకు బడ్జెట్ అద్దం పడుతుంది



**కోవూరు,ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్నిర్మాణమే ధ్యేయంగా ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్ ప్రజారంజక పాలనకు నిదర్శనమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఆయన ఛాంబర్‌లో కలిసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి పాలనా దక్షతకు అన్ని వర్గాల బలోపేతమే లక్ష్యంగా బడ్జెట్ రూపొందించారన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 సాకారం చేసే దిశగా బడ్జెట్ ఉందన్నారు. గత ప్రభుత్వ అసమర్థ పాలన నిర్లక్ష్యంతో ఆర్థికంగా కుదేలైన ఆంధ్రప్రదేశ్‌ను ఆర్థిక పరిపుష్టి పెంచే విధంగా బడ్జెట్ రూపొందించేందుకు ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపామన్నారు. ప్రతి కుటుంబం ముఖంలో చిరునవ్వు కల్పించాలనే ఆశయం, ప్రతి యువకుడికి అవకాశం కల్పించాలనే దృష్టి ప్రతి రైతు కష్టానికి గౌరవం చేకూర్చాలనే నిబద్ధతకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన లక్ష్యంగా ఈ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు సమతుల్యంగా ఫలించాయన్నారు. అన్ని వర్గాల అభివృద్ధికి, సంక్షేమానికి ఉదారంగా కేటాయింపులు జరిపి అభివృద్ధి పట్ల ప్రభుత్వ నిబద్దతను ఈ బడ్జెట్ నిరూపించిందన్నారు.

## నేడు జిల్లాలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పర్యటన వివరాలు



**నెల్లూరు,ఫిబ్రవరి14 ప్రభాతవార్త-విద్య** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం రాష్ట్రదేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి జిల్లాలోని పలు శైవక్షేత్రాలను సందర్శించటంతోపాటూ వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఇందులోభాగంగా ఉదయం 9 గంటలకి సంగం మండలంలోని శ్రీ సంగమేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శిస్తారు. 11 గంటలకి ఆత్మకూరులోని శ్రీ అన్నపూర్ణసమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు గావిస్తారు. అక్కడినుండి 12 గంటలకి కాశీనాయన ఆశ్రమంను సందర్శిస్తారు. మధ్యాహ్నం రెండు గంటలకు పెరుమాళ్ల పాడులో విలేకరుల సమావేశానికి హాజరౌతారు. 3 గంటలకి చేజర్ల మండలం కోటి తీర్థం లో స్వామి వారిని దర్శిస్తారు.సాయంత్రం నాలుగు గంటలకి అనంతసాగరం మండలం సోమశిలోని సోమేశ్వర స్వామివారిని దర్శించి , స్వామివారికి ప్రత్యేకపూజలు చేస్తారు. అలాగే స్తానిక ఎస్సీ కాలనీలో కోటీ 30లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్లకు శంకుస్థాన చేయనున్నారు. సాయంత్రం 5.30కి అనంతసాగరం మండలం చిలకలమర్రి గ్రామంలో మల్లెం కొండస్వామి దేవుని దర్శనం, 7 గంటలకి ఏఎస్‌పేట మండలం చిరమనగ్రామంలోని చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో పూజలు చేస్తారు. రాత్రి 9 గంటలకి నెల్లూరు చేరుకుని స్థానిక మూలాపేటలోని మూలస్థానేశ్వర ఆలయంలో స్వామివారిని దర్శించి , మహాశివరాత్రి కార్యక్రమాల్లో పాల్గొంటారు.

## ఘనంగా సంజీవయ్య జయంతి వేడుకలు



**నెల్లూరు,ఫిబ్రవరి14 ప్రభాతవార్త-విద్య** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత దామోదరం సంజీవయ్య 105 జయంతి వేడుకలను శనివారం సంజీవయ్య విగ్రహకమిటి చైర్మన్ పల్లం వెంకయ్య, నేతలు కొప్పోలు రఘు, బాబు, బొమ్మల బాలచెన్నయ్య ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా డిఆర్‌ఓ విజయ్‌కుమార్ ,రూరల్ డిఎస్పి ఘట్టమనేని శ్రీనివాసరావు, సాంఘిక సంక్షేమశాఖ డిడి శోభారాణిలు హాజరైయ్యారు. వారు మాట్లాడుతు ఉమ్మడి రాష్ట్రాన్ని సంజీవయ్య అభివృద్ధి పదంతో నడిపించటంలో విజయం సాధించారన్నారు. ఆయన ఆశయ సాధనకు యువత పాడుపడాలని పిలుపునిచ్చారు. అనంతరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో నాయకులు స్వర్ణవెంకయ్య, సోమశేఖర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, ప్రసాద్, ప్రభాకర్, ఆనంద్, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు కేంద్రంగా సీఎం చంద్రబాబు హజ్ యాత్రకు సబ్సిడీ ప్రకటించారు



### ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్.

**నెల్లూరు ఫిబ్రవరి 14 ప్రభాతవార్త వైద్యం** నెల్లూరు కేంద్రంగా ప్రతిపక్షంలో నేటి సీఎం చంద్రబాబు హజ్ యాత్రికులకు లక్ష రూపాయలు సబ్సిడీ ప్రకటించారని, ఇచ్చిన మాట ప్రకారం లక్ష రూపాయలు సబ్సిడీగా అందిస్తున్నారని ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. నెల్లూరులోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఏపీ స్టేట్ హజ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన హజ్ యాత్రికుల మెడికల్ స్క్రీనింగ్ మరియు వ్యాక్సినేషన్ క్యాంప్ ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా క్యాంపు గురించి హజ్ యాత్రికులను అడిగి తెలుసుకున్నారు. టెస్టులు, వాక్సినేషన్ చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. అనంతరం అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా పవిత్ర హజ్ యాత్రకు వెళ్లే 200 మందికి హెల్త్ స్క్రీనింగ్ టెస్ట్ మరియు వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. యాత్రకు వెళ్లాక ఆరోగ్య సమస్యలు ఎదురుకాకుండా ఇక్కడే బిపి,షుగర్, కిడ్నీ, లివర్ ఫంక్షన్, ఎకో, ఈసీజీ, టెస్ట్ లు చేయించి పంపుతున్నామని తెలిపారు. బ్రెయిన్ ఇన్ఫెక్షన్ కాకుండా, 65 ఏళ్ల పైబడిన వారికి ఇన్ఫెక్షన్ కాకుండా వ్యాక్సినేషన్ చేస్తున్నామని వివరించారు. తొలిసారిగా విజయవాడ నుంచి సౌదీ ఎయిర్లైన్స్ నడవబోతుందని తెలిపారు. క్యాంపులో కమ్యూనికేషన్ గ్యాప్ రాకుండా ముస్లిం డాక్టర్లను కూడా నియమించారని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ హజ్ కమిటీ సభ్యులు మీర్జా, కార్పొరేటర్ కరిముల్లా, పెంచల నాయుడు, సాబీర్ ఖాన్, రియాజ్, ఇంతియాజ్, రసూల్, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి కమిటీ సభ్యులు దారా మల్లీ, అబీదా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

## అల్ హ్యూమన్ సర్వీస్ ఆర్గనైజేషన్ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం



**నెల్లూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త** స్థానిక సంతపేట బిఈడి కాలేజ్ వెనుక ఈద్గా మిట్ట నందు ప్రఖ్యాత కంటి వైద్య ఆసుపత్రి వాసన్ ఐ కేర్ అనే జాతీయస్థాయి పేరు ప్రఖ్యాతలు కలిగిన సంస్థ వారి సహకారంతో, అత్యంత నైపుణ్యం కలిగిన వారి వైద్య సిబ్బంది పర్యవేక్షణలో, ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించడం జరిగినది. ఈ ఉచిత నేత్ర వైద్య శిబిరంలో సుమారు వందకు పైగా వ్యక్తులు హాజరై వారి సేవలను పొందడం జరిగినది. ఎక్కువ మందికి కంటి అద్దములు రాయడం జరిగినది. సుమారు 15 మంది వ్యక్తులకు శుక్లపరీక్ష అవసరమై వారికి శస్త్ర చికిత్స నిమిత్తమై అల్ హ్యూమన్ సర్వీస్ ఆర్గనైజేషన్ వారి ఆధ్వర్యంలో వారిని వాసన్ ఐ కేర్ ఆసుపత్రికి తీసుకువెళ్లి ప్రత్యేక పరీక్షలు నిర్వహింపజేసి, శస్త్ర చికిత్స కొరకు ఏర్పాటు చేయడమైనది. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ప్రజలు అల్ హ్యూమన్ సర్వీస్ ఆర్గనైజేషన్ వారు చేస్తున్న ఉచిత సేవలను కొనియాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో వాసన్ ఐ కేర్ హాస్పిటల్ వారి తరఫున ఆప్తమాలజిస్ట్ డాక్టర్ యగ్నేశ్వరి, ఏ ఆర్ టెక్నీషియన్ ఈశ్వర్, సీనియర్ మార్కెటింగ్ మేనేజర్ కృష్ణ నరేష్, అల్ హ్యూమన్ సర్వీస్ ఆర్గనైజేషన్ సంస్థ అధ్యక్షులు మొహమ్మద్ హసన్ బేగ్ సంస్థ సభ్యులు ఎం.లక్ష్మి శ్రీ, సయ్యద్ ఖాదర్, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## దామోదరం సంజీవయ్యకు ఘన నివాళులు



నెల్లూరు క్రైమ్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని పురస్కరించుకుని జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పి అజిత వేజెండ్ల ఆయనకు ఘన నివాళులు అర్పించారు. సంజీవయ్య సేవలు, నాయకత్వ లక్షణాలు నేటి తరాలకు ఆదర్శప్రాయమని ఈ సందర్భంగా ఎస్పీ పేర్కొన్నారు.

## ఈదూరులో ఉచిత వైద్య శిబిరం



**తోటపల్లి గూడూరు, ఫిబ్రవరి 14, ప్రభాత వార్త** మండలంలోని ఈదూరు గ్రామంలో శనివారం సెల్ ఎనర్జీ సంస్థ ఆధ్వర్యంలో, స్థానిక తెలుగుదేశం నాయకులు రాపర్ల మల్లికార్జున ప్రసాద్ చౌదరి నాయకత్వంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామ ప్రజలకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య స్థితిని వైద్యులు పరిశీలించారు. రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధులకు సంబంధించి ప్రత్యేక పరీక్షలు చేపట్టారు. అవసరమైన వారికి ఉచితంగా ఔషధాలు పంపిణీ చేశారు. వైద్యులు గ్రామస్తులకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ, నియమిత ఆరోగ్య పరీక్షల ప్రాముఖ్యతను వివరించారు. ఈ శిబిరానికి గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సేవలను వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా రాపర్ల మల్లికార్జున ప్రసాద్ చౌదరి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింతగా నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజల ఆరోగ్యం తమకు ముఖ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మోహిత్ కుమార్, శివకృష్ణ, విజయ దీప్తి మనోహర్, వైద్యులు, సిబ్బంది, పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు



**దగదర్తి, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త** కావలి నియోజకవర్గం దగదర్తి మండలం నేషనల్ హైవే ఇండస్ట్రియల్ ఏరియా సున్నపుబట్టి సెంటర్లో ఉన్న రాష్ట్ర ద్వితీయ కార్యాలయంలో శనివారం వినియోగదారులకు అధికారులకు ఫోరం సభ్యులకు నాయకులకు మీడియా మిత్రులకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల పరిసర ప్రాంతాల్లో జంక్ ఫుడ్ నిషేధించాలని కోరారు. విద్యార్థులకు జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకం తగ్గించి గుడ్డ సంచులను వాడాలని కోరారు. చట్టాలపై అవగాహన చేసుకోవాలని సూచించారు. కల్తీ మందులు, నూనెలు, ఆహార పదార్థాలను విక్రయించడం నేరం అని తెలిపారు. ఈ విషయంలో అధికారులు చొరవ తీసుకుని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఫోరం లీడర్స్ వినియోగదారుల భద్రత విషయంలో ఎక్కడా రాజీ లేకుండా జాగ్రత్త వహించాలని కోరారు. వినియోగదారుల సమస్యలపై స్వచ్ఛందంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న లీడర్స్, మహిళా లీడర్స్‌ని అభినందించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని చెప్పారు. మానవ హక్కుల ఉల్లంఘనలు జరిగిన యెడల ఆధారాలతో ఫోరం లీగల్ అడ్వైజర్స్ ని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చీదర్ల మల్లిఖార్జున, కావలి డివిజన్ మహిళా కార్యదర్శి నిర్మల, కావలి డివిన్ మహిళా ప్రధాన కార్యదర్శి శైలజ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాణా ప్రమోద్‌రెడ్డి జన్మదినోత్సవ వేడుకలు



**నెల్లూరు,ఫిబ్రవరి14 ప్రభాతవార్త=విద్య** కృష్ణచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్,తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తనయులు పర్వతరెడ్డి రాణా ప్రమోద్‌రెడ్డి జన్మదినోత్సవ వేడుకలను కళాశాల సిబ్బంది, వైకాపా నాయకులు, కార్యకర్తల సమక్షంలో శనివారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని స్థానిక వీఆర్‌సి సెంటర్‌లో వైకాపా విద్యార్థి విభాగం నగర అధ్యక్షులు యనమల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో అట్టహాసంగా చేపట్టారు. కార్యక్రమంలో రాణా ప్రమోద్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని 28 కేజీల భారీకేక్‌ను కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే భారీ గజమాలతో రాణాను విద్యార్థి విభాగం నాయులు ఘనంగా సత్కరించారు. అలాగే 53వ డివిజన్ వైకాపా ఇన్‌చార్జ్ వెంగల్‌రెడ్డి ఆధ్వర్యంలో రాణా జన్మదినోత్సవ వేడుకలను నిర్వహించారు. ముందుగా భారీ కేక్‌ను కట్‌చేసి వారి ఆనందాన్ని పంచుకోగా నాయులు రాణాను పుష్పగుచ్చాలు అందించి సత్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు తనపై పార్టీ నాయకులు , పార్టీ కార్యకర్తలు చూపిస్తున్న ఆదరాబిమానాలను చివరివరకు గుర్తుపెట్టుకుంటామని, తనకి జన్మదినోత్స శుభాకాంక్షలు తెలిపిన అందరికి పేరుపేరునా దన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పేర్నాటి కోటేశ్వరరెడ్డి, బాలకృష్ణ, చీదెళ్ల కిషన్, పెంచలయ్య, మహేంద్రరెడ్డి, వెంకటేశ్వర్లు, ప్రసన్న, కార్తీక్, గౌస్, దనుజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అడివిలో శివాలయంలో జిల్లా ఎస్పీ ప్రత్యేక పూజలు

వెంకటాచలం ఫిబ్రవరి 14 ప్రభాతవార్త మండల పరిధిలోనే కాగుటూరు వద్ద ఉన్న అడివిలో శివాలయంలో జిల్లా ఎస్పీ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ రామ్మూర్తి కమిటీ సభ్యులు జిల్లా ఎస్పీకి ఘనంగా స్వాగతం పలికి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శాలువాతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. మహాశివరాత్రి సందర్బంగా అధిక సంఖ్యలో అడవిలో చేయాలని భక్తులు రావడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బంది ఉండకుండా ప్రత్యేకంగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులకు సూచించారు.

## వార్తకు స్పందన



**విడవలూరు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** మండలంలోని పార్లపల్లి గ్రామం వద్ద నూతనంగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్తంభాలు వలన" విద్యుత్ స్తంభాలు ఏర్పాటుతో దంసమైన కొళాయిలు " అనే కథనం (ప్రభాత వార్త)లో ప్రచురించడంతో స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు ధ్వంసమైన పైపులైనుకు పంచాయతీ ద్వారా మరమ్మత్తులు చేసి తాగునీరు సరఫరా యధావిధిగా కొనసాగాయి.స్థానిక ప్రజలు హర్షంవ్యక్తంచేసి ప్రభాతవార్తను అభినందించారు.

## జనార్ధన్‌రెడ్డిని పరామర్శించిన మెట్టుకూరు ధనుంజయరెడ్డి



**సంగం ఫిబ్రవరి 14 ప్రభాతవార్త** సంగం మండలం మర్రిపాడు గ్రామంలోని సంగం సొసైటీ డైరెక్టర్ చేవూరు జనార్ధన్‌రెడ్డిని ఎన్‌డిసిసిబి చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి పరామర్శించారు. ఇటీవల జనార్ధన్‌రెడ్డి తండ్రి మృతి చెందడంతో మర్రిపాడులో వారి నివాసానికి వెళ్ళి జనార్ధన్‌రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈకార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులున్నారు.

## పెరుమాళ్లపాడు ఆలయానికి భద్రత దృష్ట్యా రాకండి



**చేజర్ల ఫిబ్రవరి 14 ప్రభాతవార్త** పెన్నానది గట్టున ఇసుకలో నుండి ఇటీవల వెలుగులోకి తీసిన నాగేశ్వరాలయం వద్ద పూజలు నిర్వహించేందుకు ఎవ్వరు రావద్దని ఆత్మకూరు సిఐ గంగాదర్‌రావు సూచించారు. ఇక్కడ తిరునాళ్ళు చేసేందుకు గ్రామస్తులు కోరడంతో ఆయన శనివారం ఈ ఆలయాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతు గుడిపూర్తిగా శిధిలావస్తుకు చేరుకొని ఇప్పటికే పెచ్చులు ఊడిపడు తున్నాయన్నారు. ఆత్మకూరు ఆర్డీఓ,దేవాదాయశాఖ ఈ దేవాలయాన్ని పరిశీలించి ఆలయ దర్శనానికి ఇబ్బందికరంగా ఉందని పేర్కున్నారని వివరించారు. భక్తులు ఎక్కువై జనం రద్దీగా ఉండే దేవాలయంపై కప్పు ఉడిపడిపోయే అవకాశం ఉన్నందున భక్తులకు ఎవ్వరు ఇక్కడికి రావద్దని ఇక్కడ ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించ కూడదన్నారు. స్దానిక భక్తులు,ప్రజలు ఈవిషయాన్ని గమనించి నేటి నుండి మూడు రోజులు పాటు ఆలయానికి రావద్దని కోరారు. ఆలయం సమీపంలో ముళ్ళ కంచె ఏర్పాటు చేసి పోలీసు ,రెవిన్యూ శాఖల ఆద్వర్యంలో పికెట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో చేజర్ల తహసిల్దారు మస్తానయ్య, ఎస్ఐ తిరుమలరావు, గ్రామ నాయకులు ఉన్నారు.

## శ్రీ కామాక్షిదేవి సమేత శ్రీ సంగమేశ్వరుడ్ని దర్శించుకోనున్న మంత్రి ఆనం



**సంగం ఫిబ్రవరి 14 ప్రభాతవార్త** మండల కేంద్రమైన సంగంలోని శ్రీకామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి వారి దేవస్దానాన్ని శివరాత్రి పర్వదినం పురస్కరించుకోని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనరాయణరెడ్డి ఉదయం 9 గంటలకు దర్శించుకోనున్నట్లు మండల పార్టీ అద్యక్షులు బాణా శ్రీనివాసులురెడ్డి తెలిపారు. పూజలు నిర్వహించిన అనంతరం సిఎం సహాయనిధి చెక్కులు పంపిణి చేస్తారని తెలిపారు. ఈకార్యక్రమంలో సంగం మండలంలోని టిడిపి ,జనసేన, బిజెపి నాయకులు మండల కమిటి, అనుబంధం కమీటిలవారు, బూత్ యూనిట్‌ల వారు, క్లష్టర్ కమీటిలు సాగు నీటి సంఘాల వారు ,పిఎసిఎస్ సభ్యులు, ప్రజలు పాల్గోనాలని ఆయన పిలుపునిచ్చారు.

## మహాశివరాత్రికి పటిష్టమైన బందోబస్తు



సంగం ఫిబ్రవరి 14 ప్రభాతవార్త సంగం మండలంలోని మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకోని పలు శివాలయాలలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పటిష్టమైన బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తహసిల్దారు సోమ్లానాయక్, ఎస్ఐ రాజేష్ తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలోపెట్టుకొని ఆలయాల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయడంతోపాటు క్యూలైన్లు, షామియానాలు, భక్తులకు త్రాగునీరు, విశ్రాంతి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆలయాల వద్ద పారిశుద్యం ఏర్పాట్లు పై సంబందిత అధికారులకు సూచనలు చేయడం జరిగిందని అన్నారు. భక్తులందరు మహాశివుడ్ని ప్రశాంతంగా దర్శించుకోవాలని వారు కోరారు.

## అభివృద్ధిని ప్రతిబింబించేలా బడ్జెట్ కోట మండల టిడిపి అధ్యక్షులు పలగాటి భాస్కర్‌రెడ్డి

**కోట, ఫిబ్రవరి 14ప్రభాతవార్త** రాష్ట్ర బడ్జెట్ 2026..27 అభివృద్ధిని ప్రతిబింబించేలా సమగ్రంగా సమ్యుతుల్యంగా ఉందని కోట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పలగాటి భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆయన శనివారం కోటలో ప్రభాతవార్తతో మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు,అభివృద్ధి,రైతు సంక్షేమం, మౌలిక వసతుల విస్తరణ, ఆర్థిక క్రమ శిక్షణపై స్పష్టమైన దిశానిర్దేశం చేసేలా ఉందన్నారు. అన్ని రంగాలను మేళవిస్తూ రూపొందిన బడ్జెట్ ప్రజల ఆశయాలను నెరవేర్చడంతో రాష్ట్రాన్ని మరింత ముందుకు తీసుకెళ్తుందన్నారు.వైకాపా విధ్వసంతో రాష్ట్రంలో సంక్షేమంపై అనుమానాలు ఉండేవన్నారు. వాటిని పటా పంచలు చేస్తూ సూపర్‌సిక్స్ పథకాలను ప్రభుత్వం అమలు చేసిందన్నారు. ప్రజల ఆంకాక్షలు,ఆర్థిక వనరులు తక్కువగా ఉన్నా ముందుకు వెళ్తున్నామని భాస్కర్ రెడ్డి ఉద్ఘాటించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వేగంగా సాగుతోందన్నారు.

## సనాతన ధర్మరక్షణే కూటమి ప్రభుత్వ లక్ష్యం



**నెల్లూరు,ఫిబ్రవరి14 ప్రభాతవార్త– విద్య** సనాతన ధర్మ పరిరక్షణే కూటమి ప్రభుత్వ లక్ష్యమని జనసేన పార్టీ కోర్‌కమిటి సభ్యులు నూనెమల్లి ఖార్జుయాదవ్ పేర్కొన్నారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో నేరస్తులను కఠినంగా శిక్షించాలని కోరుతూ , స్వామివారికి జరిగిన పచరాన్ని మన్నించాలని వేడుకుంటూ శనివారం నగరంలోని స్ధానిక దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం నుండి మాగుంట లేఅవుట్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయం వరకు ఆయన వినూత్న రీతిలో అంగ ప్రదక్షిణ,పొర్లు దండాలు, శాంతియుత నిరసన కార్యక్రమాన్ని విజయవతంగా చేపట్టారు. సుమారు 4 కిలోమీటర్ల మేర ఆయన తారురోడ్డుపై ఎర్రటి ఎండలో పొర్లు దండాలు పెట్టుకుంటూ స్వామి వారి ఆలయం చేరకున్నారు. అనంతరం అక్కడ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేవారు.ఈ సందర్బంగా నూనెమల్లిఖార్జున యాదవ్ మాట్లాడుతు తమ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రాము , టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్‌ల సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపటడ్డం జరిగిందన్నారు. ప్రపంచంలోని హిందువులు అందరూ ఎంతో పరమపవిత్రంగా భావించే వెంకటేశ్వరుని ప్రదాసం లడ్డూను కల్తీచేయటం దారుణమన్నారు. కల్తీచేసి మళ్లీ ఏమీ జరగలేదని వైకాపా చెప్పుకోవటం నీతిమాలిన రాజకీయాలకు ప్రత్యక్ష నిదర్శనమన్నారు. వెంటనే కల్తీ ఘటనపై వైకాపా నేత జగన్ ప్రజలకు క్షమాపణ చెప్పి తీరాలని డిమాండ్ చేశారు. జరిగిన అపచారాన్ని మన్నిచంమని కోరుతూ తాను చేపట్టిన పొర్లు దండాల యాత్రకు స్వామి వారి పూర్తి అనుగ్రహం ఉండబట్టే పూర్తిచేయగలిగామన్నారు.ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి , దోషులను, పాత్ర దారులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు స్వామి వారి మాల వస్త్రాలను దరించి పాదయాత్రగా శ్రీవారి ఆలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు, పుర ప్రజలు, హిందూ బందువులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## ఇంటర్ ప్రశ్నా పత్రాల స్టోరేజ్ పాయింట్లను తనిఖీచేసిన ఆర్ఐఓ వరప్రసాద్‌రావు



**నెల్లూరు,ఫిబ్రవరి14 ప్రభాతవార్త– విద్య** జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని ఇంటర్ ప్రశ్నా పత్రాల స్టోరేజీ పాయింట్లను శనివారం ఇంటం బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి(ఆర్ఐఓ) వరప్రసాదరావు తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఈనెల 23నుండి జిల్లాలో 81 కేంద్రాల్లో ఇంటర్ విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలను నిర్వహించటం జరుగుతుందన్నారు. ఇందులో బాగంగా జిల్లాలోని 33 ప్రాంతాల్లో ప్రశ్నాపత్రాల స్టోరేజీ పాయింట్స్ కోసం ఎంపిక చేసి అందుకు తగిన ఏర్పాట్లను చేయటం జరిగిందన్నారు. అలాగే స్టోరేజీ పాయింట్స్‌లో 17మంది అద్యాపకులను కస్టోడియన్‌లుగా నియమించామన్నారు. పరీక్షలను పటిష్టంగా నిర్వహించేందుకు అన్నీ ఏర్పాట్లు చేయటం జరిగిందన్నారు. అలాగే ప్రశ్నాపత్రాల నిల్వకు కూడా తగిన ఏర్పాట్లను పూర్తిచేయటం జరిగిందన్నారు. అదికారులు అందరూ సమీస్టిగా కృషిచేసి పరీక్షలను విజయవతంగా నిర్వహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శివరాత్రికి శివాలయాలు ముస్తాబు



**కోట, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త** కోట మండలం అల్లంపాడు గ్రామంలో శ్రీ కామాక్షిదేవి సమేత అగస్త్యర స్వామి ఆలయం శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. ఆలయాన్ని విద్యుద్దీప కాంతులతో తీర్చిదిద్దారు. నిత్యం శివనామ స్మరణలతో మార్మోగే ఈ ఆలయంలో ఏర్పాట్లను శనివారం వైసీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి పర్యవేక్షించారు. అదేవిధంగా గూడలి కొండపై శ్రీభీమేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు, విశేష అలంకరణలు, కుంకుమార్చన, హోమాలు, ఇతర పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ కొండపై జరిగే శివరాత్రి వేడుకలకు గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ హాజరు కానున్నట్లు టిడిపి నాయకులు తెలిపారు.

## గుర్తు తెలియని దుండగులు హుండీ చోరీయత్నం



**కావలి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** స్థానిక ఉత్తరం పేటలోని జండా చెట్టు వద్ద ఉన్న హుండీని శుక్రవారం అర్ధరారతి గుర్తు తెలియన దుండగులు తాళం పగలుగొట్టి చోరీయత్నానికి పాల్పడడం జరిగింది. దర్గా కమిటీ సభ్యులు,స్థానికులు సమాచారం మేరకు ఇటీవల జరిగిన గ్రంధ మహోత్సవానికి హుండీలోని నగదును తీసివేయడం జరిగిందని ప్రసుత్తం హుండీలో అధిక మొత్తంలో నగదు లేదని తెలిపారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించడం జరిగింది.

## సూర్యప్రభవాహనం,హంసవాహనంపైన శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి వారు



**బుచ్చి ఫిబ్రవరి 14 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలోని శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి వారి సూర్య ప్రభ వాహనంపైన భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారిని పరిమళ పుష్పాలతో అలంకరించారు. ఈకార్యక్రమానికి ఉభయకర్తలుగా తన్నీరు లక్ష్మీ ప్రసాదరావు, రూపకళ, కుటుంబసభ్యులు, తన్నీరు పెంచల దీపక్‌పవన్, లాస్య ప్రియ,కుమార్తె లక్ష్మీ వ్యవహారించారు. అలాగే హంసవాహన సేవ నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఉభయకర్తలుగా గాదంశెట్టి సుబ్రహ్మణ్యం, బాగ్యలక్ష్మీ, గాదంశెట్టి రమేష్, వరలక్ష్మీ వ్యవహారించారు.భక్తులకు తీర్ద ప్రసాదాలు అందజేశారు.

## విండ్రోకంపోస్టు తయారీ కేంద్రం పరిశీలన



**కావలి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** కావలి పురపాలక సంఘం వారు నిర్వహిస్తున్న విండ్రో కంపోస్టు తయారీ కేంద్రాన్ని శుక్రవారం మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్‌కుమార్‌తో కలిసి ప్రాంతీయ సంచాలకులు ఎస్.హరిక్రిష్ణ పరిశీలించి జరుగుతున్న పనులకు సంబంధించి మున్సిపల్ కమిషనర్ తీసు కొన్న చొరవకు ప్రత్యేక ప్రశంసలు తెలిపారు. స్వచ్ఛసర్వేక్షన్ 2026 కార్యక్రమంలో భాగంగా కావలి పురపాలక సంఘం నందు హరిక్రిష్ణ పర్యటించి కావలిలోని శానిటేషన్ సెక్రటరీలతో సమావేశంను నిర్వహించి స్వచ్ఛసర్వేక్షణ్ 2026 కార్యక్రమంపైన కొన్ని విలువైన సూచనలు సలహాలు తెలిపారు. ఈకార్యక్రమంల మంచిపనితీరు కనపరుస్తున్నారని అదే నిబద్దతతో పనిచేసినచో రాష్ట్ర, కేంద్ర స్థాయిలో గురింపు పొందగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

## లారీ ఢీకొని వ్యక్తి మృతి



**చిల్లకూరు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త** మండల పరిధిలోని తిక్కవరం గ్రామం సమీపంలో బైక్ పై వెళుతున్న వ్యక్తిని లారీ ఢీకొని అక్కడక్కడ మృతి చెందాడు. పోలీసులు వివరాల మేరకు తిక్కవరం హరిజనవాడకు చెందిన గారా గోపి (40) అనే వ్యక్తి బైక్ పై పనులు నిమిత్తం గూడూరుకి వెళుతున్న క్రమంలో ఎదురుగా కంకర లోడుతో వస్తున్న టిప్పర్ అదుపుతప్పి ఢీకొంది. లారీ ముందర చక్రం తలపై ఎక్కడంతో గోపి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మృతదేహం వద్ద బోరున విలపించారు. గోపి కుటుంబానికి న్యాయం జరగాలని కుటుంబ సభ్యులు వాహనాలు రాకపోకలను అడ్డుకోవడం జరిగింది న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామన్నారు. అనంతరం పోలీసులు సర్ది చెప్పి న్యాయం జరిగేందుకు చర్యలు చేపడతామన్నారు. మృతదేకాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి ప్రమాదానికి కారణమైన లారీను పోలీస్ స్టేషన్ తరలించారు డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

## వ్యక్తి అనుమానస్పద మృతి



**చిల్లకూరు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త** మండల పరిధిలోని నేలబల్లి, రెట్టుపల్లి గ్రామంలో ఓ వ్యక్తి అనుమానస్పద మృతి చెందినట్లు సమాచారం శనివారం చోటు చేసుకుంది. స్థానికులు వివరాల మేరకు గ్రామానికి చెందిన ఏడం రమణారెడ్డి (83) అనే వ్యక్తి శుక్రవారం ఉదయం గేదెలను గ్రామ సమీపం పొలాల్లో మేతకు తోలుకొని పోవడం అయితే సాయంత్రం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామ పరిసర ప్రాంతాల్లో గాలించిన ఆచూకీ లభ్యం కాలేదు. శనివారం ఉదయం గ్రామ సమీపంలో జామాయిల్ తోటలో రమణారెడ్డి రక్తపు గాయాలతో పడి మృతి చెందిన విషయాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో చిల్లకూరు ఎస్సై సురేష్ బాబు, తిరుపతయ్య, సిఐలు శేఖర్ బాబు, శ్రీనివాస్ క్లూజ్ టీం డాగ్ స్క్వాడ్ సంఘటన స్థలానికి చేరుకుని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రాంతీయ వర్షాలు తరలించారు. అయితే రమణారెడ్డిచేతికి ధరించిన బంగారు ఉంగరం కనిపించకపోవడంతో ఎవరైనా బంగారం ఉంగరం కోసమే రమణారెడ్డిని హత్య చేసి ఉంటారని భావిస్తున్నారు.

## దామోదర సంజీవయ్యకి ఘన నివాళి



**గూడూరు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త** గూడూరు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో దివంగత ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య 105వ జయంతి సందర్భంగా తహసీల్దార్ ఆర్.వి.ప్రసాద్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల ఆశా జ్యోతి దామోదర సంజీవయ్య అని కొనియాడారు. పేదల అభ్యున్నతికి ఎంతో కృషి చేసారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరు కొనసాగించాలని పేర్కోనారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చైతన్య, వి.ఆర్.వోలు రాధాకృష్ణ, శివ కుమార్, హనుమంతు, విజయ్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ మాఫియాకి అడ్డుకట్ట వేయాలి




**గూడూరు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త** మెడికల్ మాఫియాకి అడ్డుకట్ట వేయాలని గూడూరు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జి. శశి కుమార్ పేర్కొన్నారు. శనివారం గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రోజు రోజుకి మెడికల్ మాఫియా ఆగడాలు ఎక్కువైపోతున్నాయి అని ఎద్దేవా చేశారు. రోగులకు నాసిరకం మందులు పంపిణీ చేయడంతో పాటు వాటిని అధిక ధరలకు అమ్మకాలు చేసి, కోట్లాది రూపాయలు దోచుకుంటున్నారని తెలిపారు. మాఫియాకు కూటమి ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలని ఆయన కోరారు. అద్దె సర్టిఫికెట్లతో ఫార్మేషన్ లేకుండా నిర్వహిస్తున్న మెడికల్ షాపుల పై తనిఖీలు నిర్వహించి తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో డ్రగ్స్ ఇన్స్పెక్టర్, ఉన్నత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న మెడికల్, ఫార్మా మాఫియాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి నారాయణ, గోపాలయ్య, క్రాంతి, వెంకటేశ్వర్లు, రిజ్వాన్, మోహన్, విక్రమ్, సునీల్, శివ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ సద్గురు సిల్వర్‌ఓక్ పాఠశాల క్రీడోత్సవ వేడుకలు



**నెల్లూరు,ఫిబ్రవరి14 ప్రభాతవార్త– విద్య** స్థానిక పార్ధసారధి నగర్‌లోని శ్రీ సద్గురు సిల్వర్‌ఓక్ సిబిఎస్సీ పాఠశాల వార్షికోత్సవ క్రీడా వేడుకలను శనివారం నగరంలోని స్థానిక ఏసీసుబ్బారెడ్డి క్రీడా ప్రాంగనణంలో ఎస్ఎస్ ఓక్స్ స్ప్రింట్ సాగా 2026,2027 పేరుతో ఘనంగా నిర్వ హించారు.ఈ వేడుకల్లో నగర డిఎస్పీ దిక్షా ఐపిఎస్, అడిషనల్ జైల్ సూపరిండెంట్ ప్రకాష్, ఎంఈఓ వెంకటేశ్వర్లు నాయక్‌లు పాల్గొని క్రీడలను ప్రారంభించారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతు ఇటువంటి కార్యక్రమాల నిర్వహణతో విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభ భహిర్గతం అవుతుందన్నారు. క్రీడలో మానశిక శారీరక ఉల్లాసం దక్కుతుందన్నారు. పాఠశాల డైరెక్టర్లు షణ్ముఖ ఆచారి, వెంకటాద్రి నాయుడులు మాట్లాడుతు ప్రతి ఏటా ఈ కార్యక్రమాన్ని వేడుకలా జరుతున్నామన్నారు. సిబిఎస్సీని బోదిస్తూ క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న ఏకైన విద్యాసంస్థ తమదేనని తెలిపారు.అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ సుదాకర్‌రావు, కోచ్ నాగార్జున, ప్రత్యూష, అమీదా, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సీఎం సంజీవయ్య 105వ జయంతి వేడుకలు



విడవలూరు,కొడవలూరు ఫిబ్రవరి14 ప్రభాతవార్త : దివంగత నేత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 105వ జయంతి వేడుకలు విడవలూరు, కొడవలూరు మండలాల తహశీల్దార్ కార్యాలయాల్లో తహశీల్దార్ కె. చంద్రశేఖర్, కె. స్ఫూర్తి రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.మాజీ ముఖ్యమంత్రి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ను అభివృద్ధి పథంలో నడిపించడంతోపాటు అట్టడుగు వర్గాల అభ్యున్నతికి చేసిన సేవలను కొనియాడారు. ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకు నడవాలని కోరారు.అంతకముందు మాజీ ముఖ్యమంత్రి సంజీవయ్య చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. డిప్యూటీ తహశీల్దార్ సారంగపాణి, సిబ్బంది మహేష్, వెంకటేశ్వర్లు, మల్లికార్జున్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం




**చిల్లకూరు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త** చిల్లకూరు మండలంలోని ఏరూరు గ్రామంలో ఉన్న శివ గణేష్ క్రీడా మైదానంలో శనివారం చిల్లకూరు మండల సీనియర్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధినేత రాజనేని శ్రీనివాసులు నాయుడు చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్నేహితులంతా ఒకటిగా చేరి గత 17 సంవత్సరాలుగా మండలంలో క్రికెట్ టోర్నమెంట్ను నిర్వహిస్తూ గెలుపొందిన నగదును సేవా కార్యక్రమాలకు వినియోగించడం అభినందనీయమన్నారు. ప్రతి సంవత్సరం ఈ టోర్నమెంట్కు కావలసిన సహాయ సహకారాలను మా ట్రస్ట్ ద్వారా అందిస్తామని తెలియజేశారు. అనంతరం వివిధ జట్ల మధ్య క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కో ఫౌండర్ రాజనేని శిరీషమ్మ, ఆర్గనైజర్లు మధు, మోహన్, రఘు, చేవూరు నాగరాజు, హెచ్ఎం శివ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.







## తానంకి నానాజీకి సైకత శిల్పంతో జన్మదిన శుభాకాంక్షలు

### తెలిపిన సనత్ కుమార్




**చిల్లకూరు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త** తానంకి నానాజీ జన్మదిన పురస్కరించుకొని చిల్లకూరు మండలం ఏరూరు గ్రామం చెందిన మంచాల సనత్ కుమార్ శనివారం సముద్ర తీరాన పారిశ్రామికవేత్త పెనుసిల లక్ష్మి నరసింహస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ తానంకి నానాజీ జన్మదిన సందర్భంగా ఇవే మా హార్దిక శుభాకాంక్షలు సిలికా సాండ్తో సైనిక శిల్పాన్ని ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా మంచాల సనత్ కుమార్ మాట్లాడుతూ సామాజికవేత్తగా అనేకమైన సేవా కార్యక్రమాల్లో ముందుంటూ పేదలకు ఎన్నో సహాయాలు చేస్తున్నటువంటి మంచి మనిషి ఆయన సేవా కార్యక్రమాలు దృష్టిలో ఉంచుకొని ఆయన జన్మదినం సందర్భంగా ఈ సైకతశిల్పాన్ని ఆయనకు అంకితం చేస్తున్నానన్నారు.

## పుల్వమా ఘటనలో అమరులకు ఘన నివాళులు



**గూడూరు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త** భారతీయ జనతా యువ మోర్చా బీజేవైఎం గూడూరు ఆధ్వర్యంలో గూడూరు పట్టణంలో స్థానిక సాయి విద్యానికేతన్ పాఠశాలలో పుల్వామా ఘటనలో అమరులైన సైనికులకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీజేవైఎం నాయకులు గిద్దలూరు మనోజ్ కుమార్ మాట్లాడుతూ 2019 ఫిబ్రవరి 14వ తేదీన పుల్వామాలో భారత సైనికులను పాకిస్థాన్ తీవ్రవాద సంస్థ ఆత్మహుతి బాంబు దాడి వలన భారత సైనికులు 40 మంది చనిపోవడం జరిగిందన్నారు. అమరులైన సైనికులు త్యాగం వృధా కాదని వాళ్ళ ఆశయం ఆగిపోదని ఆయన అన్నారు ప్రతి విద్యార్థి యువత వాళ్ల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని భారతదేశం కోసం ప్రాణాలను ఇచ్చిన సైనికులను గుర్తు చేసుకోవాలని, ప్రతి ఒక్కరు కూడా దేశభక్తి కలిగి ముందుకు నడవాలని దేశ సరిహద్దుల్లో మనకోసం నిరంతరం పనిచేస్తున్న సైనికులకు వందనాలు తెలియజేస్తూ అమరులైన సైనికులకు నివాళులర్పించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నగర అధ్యక్షులు శివశంకర్, బీజేవైఎం ఉపాధ్యక్షులు కార్తీక్, ప్రణయ్ నవీన్ కిరణ్ ప్రదీప్ అరవింద్ సాయి విద్యానికేతన్ పాఠశాల ప్రిన్సిపల్ దయాకర్, ఉపాధ్యాయులు జమీర్, విద్యార్థులు, యువత పాల్గొన్నారు. అనంతరం నారాయణ ఇంజనీరింగ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు అమర వీరులకు ఘన నివాళులు అర్పించారు. ఏవో పద్మయ్య, భవాని, భా రతి, గోమతి, గురు ప్రసాద్, నాగభూషణం,పాల్గొన్నారు.

## రక్తదాన మరొకరికి ప్రాణదానం




**చిల్లకూరు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త** రక్తదానం మరొకరికి ప్రాణదానం అని మండల పరిధిలోని ఏరూరు గ్రామానికి చెందిన సతుకుమాటి సుధీర్కుమార్ రెడ్డి అన్నారు. శనివారం ఏరూరు గ్రామంలో కీర్తిశేషులు సతుకుమాటి అఖిల్ రెడ్డి జయంతి సందర్బంగా మేఘ రక్తదాన శిబిరం, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నెల్లూరు పట్టణంలోని విజయ శ్రీ బ్లడ్ బ్యాంకు వారి ఆధ్వర్యంలో 102 యూనిట్లు బ్లడ్ను స్వీకరించారు. అదేవిధంగా 300 మంది వివిధ రకాల సమస్యలతో ఈసీజీ పరీక్షలు ప్రత్యేక కంటిపరీక్షలు దంత పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు తీసుకోవడం జరిగింది. అదేవి ధంగా చిల్లకూరు గ్రామంలోని డానియల్ చిల్డ్రన్ హోమ్ నందు సతుకుమాటి ప్రగతి చేతుల మీదగా విద్యార్థులకు విద్యా సామాగ్రి అందించారు.సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ఎంతోమంది ప్రమాదాల బారినపడి రక్తం సకాలంలో అందక ప్రాణాలు కోల్పోయిన వారు ఎందరో ఉన్నారని అలా జరగకుండా ఉం డేందుకు ప్రతి ఒక్క యువకులు ముందుకు వచ్చి ఈరోజు రక్తాన్ని దానం చేయడం సంతోష దాయ కమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేయడం జరుగుతుందన్నారు. సతుకుమాటి సుధీర్ కుమార్ రెడ్డి, ప్రగతి, నారాయణ హాస్పిటల్. సిబ్బంది చింతవరం హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## డైమండ్ వరల్డ్ రికార్డ్ అవార్డ్ అందుకున్న డాక్టర్ మయూరి శ్యామ్ యాదవ్



**గూడూరు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త** గూడూరు పట్టణానికి చెందిన ప్రముఖ సామాజికవేత్త, సేవా దృక్పరుడు శ్రీకృష్ణ సేవా సమితి ఫౌండర్ చైర్మన్, జీవన్ దాన్ ఆర్గాన్ డోనార్ డాక్టర్ బండి శ్యామ సుందరరావు(మయూరి శ్యామ్ యాదవ్) అరుదైన డైమండ్ వరల్డ్ రికార్డ్ అవార్డ్ను సాధించడం జరిగింది. మయూరి శ్యామ్ యాదవ్ చేసినటువంటి సామాజిక సేవా కార్యక్రమాలు గుర్తించి డైమండ్ వరల్డ్ రికార్డ్ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డును తెలంగాణ మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ పార్లమెంట్ సభ్యులు వేణుగోపాలచారి, ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇండియా చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ బింగి నరేందర్ గౌడ్ల చేతుల మీదుగా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మ్యూజిక్ డైరెక్టర్ సింగర్ లిరిక్ రైటర్ భోలే షావలి, ప్లే బ్యాక్ సింగర్ ప్రవీణ్ కుమార్, నిర్మాత విజయ్, చిత్ర, ఈ పేపర్ ఎడిటర్ గుర్రపు విజయ్ కుమార్లు అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ డైమండ్ వరల్డ్ రికార్డ్ ప్రెసిడెంట్ యస్ కె విల్సన్కి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను అని అన్నారు.విద్య, వైద్యం, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించేదానికి స్ఫూర్తిని కలిగించిన నా తల్లిదండ్రులు కీర్తిశేషులు బండి వనమ్మ,బండికృష్ణయ్య పాదాలకు నమస్కారాలు తెలియజేస్తున్నానని, నాకుటుంబ సభ్యులసహకారానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నానన్నారు.

## ప్రగతి సేవా సంస్థ సేవలు అభినందనీయం: కోడూరు మీరా రెడ్డి



**గూడూరు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త** ప్రగతి సంస్థ సేవలు అభినందనీయమని కోడూరు మీరా రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకి అతీతంగా అందరిని కలుపుకుని పోయి పేద ప్రజలకు నిస్వార్ధంగా సేవ అందిస్తున్నారని కొనియాడారు. అనంతరం గూడూరు పట్టణంలోని ఓం శ్రీ వృద్ధాశ్రమంలో 40 మంది పేదలకు కోడూరు మీరా రెడ్డి చేతుల మీదుగా దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి దాతగా కోడూరు మీరా రెడ్డి వ్యవహరించారు. అనంతరం ప్రగతి సేవా సంస్థ ప్రతినెల క్రమం తప్పకుండా రెండవ శనివారం శ్రీ సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమం నందు మేడనూరు సురేష్ రెడ్డి, శాంతి దంపతుల అధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. వాచ్ షాప్ రాము, ఐటిఐ ప్రభాకర్, డివిఎంసి మెంబర్స్ వెంకటేశ్వర్లు, కోట వెంకటేశ్వర్లు, గోల్డ్ షాప్ మల్లికార్జున్, నవీన్ జై కుమార్, శ్యామ్ నిర్వాహకురాలు కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

## జొన్నవాడ శ్రీమల్లికార్జున స్వామి కామాక్షితాయి సన్నిధిలో ప్రదోష కాల వృషబార్చన



**బుచ్చి ఫిబ్రవరి 14 ప్రభాతవార్త** పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి సన్నిధిలో శనివారం జగద్గురు కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి వారి దివ్య ఆశీస్సులతో బహుళ త్రయోదశి సందర్భంగా నందీశ్వరునికి ప్రదోషకాల వృషభార్చన కార్యక్రమాన్ని అత్యంత వేడుకంగా నిర్వహించారు. నందిశ్వరుడికి, శ్రీమల్లికార్జునస్వామి వారికి ఒకే సారి అభిషేకాలు,హారతులు ఇవ్వగా అది చూసి భక్తులు తరించారు. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ తిరుమూరు అశోక్రెడ్డి, కార్యనిర్వహణాధికారి ఆర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి ,పాలక మండలి సభ్యులు పర్యవేక్షించారు.

## శేషవాహనంపైన శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి వారు మూలవిరాట్కి అభిషేకం



**బుచ్చి ఫిబ్రవరి 14 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలోని శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామివారి మూలవిరాట్కి అభిషేకాలు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఉభయకర్తలుగా ఇనుగూరు సుబ్బారావు, ధనలక్ష్మీ వ్యవహారించారు. రాత్రికి అత్యంత వేడుకగా శేషవాహనోత్సవం నిర్వహించారు. భక్తులు గ్రామోత్సవంలో స్వామి వారిని దర్శించుకున్నారు. ఈకార్యక్రమానికి ఉభయకర్తలుగా చెవ్వు సంపూర్ణమ్మ- కుటుంబసభ్యులు ( చెవ్వు పెద శంకరయ్య) వ్యవహారించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాలను కమీటి వారు పర్యవేక్షించారు.

## లిటిల్ ఏంజిల్స్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్కు అవార్డు ప్రధానం



**గూడూరు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త** గూడూరులోని లిటిల్ ఏంజిల్స్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ బుసారెడ్డి శ్రీకాంత్ రెడ్డికి కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, నీతి ఆయోగ్ ప్రతిష్టాత్మక భరత్ భూషణ్ సన్మాన్ అవార్డును ప్రదానం చేశారు. ఫిబ్రవరి 14న మహారాష్ట్రలోని అహ్మద్ నగర్లో జరిగిన ఒక గొప్ప కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఫిరోజ్ ఖాన్ నిర్వహించారు. గ్రామీణ భారతదేశంలో నాణ్యమైన విద్యను అందించడంలో లిటిల్ ఏంజిల్స్ పబ్లిక్ స్కూల్ 40 సంవత్సరాల అంకితభావంతో చేసిన సేవను, దేశ నిర్మాణంలో, వెనుకబడిన వర్గాల విద్యార్థుల సాధికారతకు గణనీయంగా దోహదపడిన విషయాన్ని ఈ ప్రతిష్టాత్మక గౌరవం గుర్తిస్తుంది. ఆయన దార్శనిక నాయకత్వం విద్యా నైపుణ్యం పట్ల నిబద్ధత గ్రామీణ ప్రాంతంలో యువ మనస్సులను రూపొందించడంలో విద్యా ప్రమాణాలను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించాయి. ఈ అవార్డు అందుకున్న శ్రీకాంత్ రెడ్డి తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. దీనిని తన కెరీర్లో అత్యంత ప్రతిష్టాత్మకమైన గుర్తింపులలో ఒకటిగా అభివర్ణించారు. దశాబ్దాలుగా సంస్థ ప్రయాణానికి మద్దతు ఇచ్చిన తన బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు శ్రేయోభిలాషులకు ఆయన ఈ అవార్డును అంకితం చేశారు. ఈ విజయం లిటిల్ ఏంజిల్స్ పబ్లిక్ స్కూల్కి గర్వకారణంగా నిలుస్తుంది.

## కలెక్టరేట్ లో ఘనంగా సంజీవయ్య జయంతి వేడుకలు

**- చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన డిఆర్ఓ ఎన్ విజయ్ కుమార్**




**నెల్లూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త** నేటి యువత చెడుబాటు పట్టకుండా మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్. విజయ్ కుమార్ అన్నారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని తిక్కన ప్రాంగణంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దామోద్వర సంజీవయ్య 105వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం దామోద్వర సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించిన అనంతరం రెవెన్యూ అధికారి మాట్లాడుతూ దామోద్వర సంజీవయ్య జీవితం యువతకు ఎంతో ఆదర్శనీయమని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్కి తొలి దళిత ముఖ్యమంత్రిగా పనిచేశారని కేంద్ర మంత్రిగా కూడా పనిచేసి పలువురి ప్రశంసలు అందుకున్నారన్నారు. కొంతకాలం కాంగ్రెస్ అధ్యక్షునిగా కూడా పనిచేశారని ఆయన తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు, ఉపాధ్యాయులు మహనీయుల జీవిత చరిత్రలు నేటి యువతకు తెలియజేయవలసిన అవసరం ఉందన్నారు. వారి ఆశయాలను ప్రజల ముంగిటకు తీసుకు వెళ్లవలసిన అవసరం మన అందరి మీద ఉంది అని అభిప్రాయపడ్డారు. సమాజానికి మంచి వ్యక్తులను అందించే బాధ్యత మన అందరి పై ఆధారపడి ఉందని ఆయన అన్నారు. అన్యాక్రాంతమవుతున్న దళిత భూములకు సంబంధించి జిల్లా కలెక్టర్ వారితో చర్చించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతివారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల దినోత్సవం సందర్భంగా సుమారు 400 నుంచి 500 పైగా ఫిర్యాదులు అందుతున్నాయని వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు వాటి వివరాలను సంబంధిత అర్జీదారులకు తెలియజేయడం జరుగుతున్నదని ఆయన తెలిపారు. పలువురు దళిత సంఘ నాయకులు స్వర్ణ వెంకయ్య, సుబ్బారావు, కొప్పోలు రమణయ్య, బాల చెన్నయ్య, పందిటి సుబ్బయ్య మరియు కే. పెంచలయ్య తదితరులు మాట్లాడుతూ దామోదర సంజీవయ్య నిరాడంబరుడని, నిస్వార్థపరుడని కొనియాడారు. నేటి రాజకీయ వ్యవస్థలో పదవులు వచ్చిన వెంటనే ఆస్తిపరులు అవుతున్నారని ఆనాడు దామోదర సంజీవయ్య అలాంటి బాటపట్టక సచ్ఛీలతకు మారుపేరుగా నిలబడ్డారన్నారు. దళితుల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శోభారాణి, వారి సిబ్బందితోపాటు విద్యార్థినీ, విద్యార్థులు పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 30 ఏళ్లకే గుండెపోటా? యువతలో పెరుగుతున్న సైలెంట్ ప్రమాదం

**డా. సి. విజయ్ అమర్నాథ్ రెడ్డి**
**ఎం.డి., డి.ఎం (కార్డియాలజీ), నిమ్స్-హైదరాబాద్**
**సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ మెడికవర్ హాస్పిటల్స్,**



**నెల్లూరు ఫిబ్రవరి 14 ప్రభాతవార్త వైద్యం** ఒకప్పుడు గుండెపోటు అంటే పెద్దవారికి వచ్చే సమస్యగా భావించేవారు. కానీ ఇప్పుడు 25-40 ఏళ్ల యువతలో కూడా గుండెపోటులు ఆందోళనకరంగా పెరుగుతు న్నాయి. తాజా గణాంకాల ప్రకారం, భారతదేశంలో గుండెపోటు కేసుల్లో సుమారు 20-25 మంది 40 ఏళ్ల లోపు వారే ఉండటం ఆందోళన కలిగిస్తోంది.

**ఎందుకు యువత ప్రమాదంలో?**

**ఈరోజు జీవనశైలి ప్రధాన కారణంగా మారింది:** తీవ్ర మానసిక ఒత్తిడి, రాత్రిపూట నిద్రలేమి ఫాస్ట్ ఫుడ్ అలవాటు, పొగ త్రాగడం మద్యం వ్యాయామం లేకపోవడం ,షుగర్, బీపీ పెరుగుదల ఇవి రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోయి అకస్మాత్తుగా బ్లాక్ ఏర్పడటానికి దారితీస్తాయి. గుండెపోటు ముందు వచ్చే హెచ్చరికలు చాలామంది యువకులు ఛాతినొప్పిని గ్యాస్ సమస్యగా భావించి నిర్లక్ష్యం చేస్తారు.

**కానీ ఈ లక్షణాలు ప్రమాద సూచనలు కావచ్చు:** ఛాతిలో ఒత్తిడి లేదా మండడం ,ఎడమ చేయి, మెడ లేదా దవడకు వ్యాపించే నొప్పి అకస్మాత్తుగా చెమటలు, ఊపిరి బిగుసుకుపోవడం, అసహజమైన అలసట "**గోల్డెన్ అవర్" ఎందుకు ముఖ్యం?** గుండెపోటు వచ్చిన మొదటి ఒక గంట అత్యంత కీలకం. ఈ సమయంలో ఆసుపత్రికి చేరుకుంటే, యాంజియోప్లాస్టీ చేసి స్టెంట్ ద్వారా బ్లాక్ తొలగించి గుండె కండరాన్ని రక్షించవచ్చు. ఆలస్యం ప్రాణాపాయం. గుండెపోటు ఇప్పుడు వయస్సుతో సంబంధం లేకుండా వస్తోంది. 30 ఏళ్ల వారిలో కూడా తీవ్రమైన బ్లాక్స్ చూస్తున్నాం. ఛాతినొప్పిని గ్యాస్గా తీసుకోవడం ప్రమాదకరం. సకాలంలో ఆసుపత్రికి వస్తే పూర్తిగా కోలుకునే అవకాశం ఉంది. ప్రతి యువకుడు సంవత్సరానికి ఒకసారి హెల్త్ చెకప్ చేయించుకోవాలి," అని డా. విజయ్ అమర్నాథ్ రెడ్డి తెలిపారు.

**ఎలా నివారించాలి?** రోజుకు కనీసం 30 నిమిషాలు నడక,పొగతాగడం పూర్తిగా మానడం జంక్ ఫుడ్ తగ్గించడం, బీపీ, షుగర్ నియంత్రణ ,ఒత్తిడి తగ్గించే జీవనశైలి యువతలో గుండెపోటు"సైలెంట్ కిల్లర్"గా మారుతోంది. చిన్న లక్షణాన్నీ నిర్లక్ష్యం చేయకుండా, వెంటనే వైద్యులను సంప్రదించడం ప్రాణాలను కాపాడుతుంది.

## ఓవెల్లో ఘనంగా ట్విలైట్ వేడుకలు



**నెల్లూరు,ఫిబ్రవరి14 ప్రభాతవార్త=విద్య** నగరంలోని స్థానిక అన్నమయ్య సెంటర్లోని ఓవెల్ పాఠశాలలో శనివారం ట్విలైట్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్ ఆర్.వేణు, సిఈఓ ఆర్.ప్రమీల లు మాట్లాడుతు నిత్యం పని ఒత్తిడిలో ఉండేవిద్యార్థుల తల్లి దండ్రులకు ట్విలైట్ పేరుతో క్రీడా పోటీలను నిర్వ హించటం , అందులో వారు ఉత్సాహంగా పాల్గొనటం సంతోషంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వాలీబాల్,షటిల్, టగ్ఆఫ్వార్, స్లో సైకిలింగ్ ,క్యారమ్స్, త్రోబాల్, మెహంది, జడ అల్లికలు వంటి వాటిలో పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీఎం మహదేవయ్య, డిజిఎం రఫీ, ప్రధానోపాధ్యాయులు రమణయ్య, మీనాక్షి, మహేశ్వరి, రాజేష్, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విఆర్ఓపై దాడిచేసిన వారిని శిక్షించాలి

**విఆర్ఓల సంఘం డిమాండ్**



**నెల్లూరు కార్పోరేషన్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా కొండాపురం మండలం ఇసుకదామచర్ల గ్రామ రెవెన్యూ అధికారి మురళీక్రిష్ణపై అదే గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి భూవివాద విషయం పై విఆర్ఓని సచివాలయంలో నిర్బందించి దుర్బాషలాడిన వారిని కఠినంగా శిక్షించాలని జిల్లా విఆర్ఓల సంఘం కార్యదర్శి డి.వి.రమణయ్య డిమాండ్ చేశారు. శనివారం జిల్లా జర్నలిస్టు భవన్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విఆర్ఓపై దాడిచేయడం అనాగరికమైన చర్యగా భావిస్తున్నామని తెలిపారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ఉండాలంటే దుర్బాషలాడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, ఎస్పి దృష్టికి తీసుకెళ్ళడం జరిగిందన్నారు. దాడిచేసిన వారిపై చర్యలు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోక పోతే దశలవారీగా 16నుంచి నల్లబ్యాడ్జిలు ధరించి తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడూరు డివిజన్ ప్రెసిడెంట్ గిద్దలూరు రమణయ్య, ఆత్మకూరు డివిజన్ ప్రెసిడెంట్ బివి.శేషారెడ్డి, ఆత్మకూరు డివిజన్ సెక్రటరీ సూరిపోగు క్రిష్ణయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కన్నెదార రవిశేఖర్నాయుడు, విఆర్ఓ జనరల్ సెక్రటరీ మన్నేపలి రమేష్, గంగప ఉదయ్తేజ, డివిజన్ కార్యవర్గ సభ్యులు చిన్నారావు చంద్రశేఖర్, ప్రసాద్రావు, గూడూరు డివిజన్ కార్యవర్గ సభ్యులు పుల్లయ్య, దాసరి హనుమంతయ్య, జిల్లా ఉపాధ్యక్షులు కంచి చంద్రశేఖర్ జిల్లా కార్యవర్గ సభ్యులు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఆర్పిఐ పార్టీలో బారీ చేరికలు




**నెల్లూరు కార్పోరేషన్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** జిల్లా కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) నుంచి వీడిఆర్పిఐ పార్టీలో చేరిన వాటం బేటి నాగేంద్ర వారి బృందం శనివారం ఉదయం స్థానిక గాంధీబొమ్మ వద్ద ఉన్న ఆర్పిఐ పార్టీ జిల్లా కార్యాలయం నందు సీనియర్ నాయకుడు పి.ప్రకాష్యాదవ్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు ఎస్కె.మాబు సమక్షంలో ఆర్పిఐ పార్టీలో చేరారు. ఈసందర్బంగా జిల్లా అధ్యక్షులు ఎస్కె.మాబు మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్ స్థాపించిన ఆర్పిఐ పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. ఇతర రాష్ట్రాల స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులను కాదని ఇతర రాజకీయ పార్టీ అభ్యర్థులను ప్రజలు ఎన్నుకున్నారన్నారు. నగరంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆర్పిఐ పార్టీ సత్తా చాటుతుందని వివరించారు. అనంతరం వాటంబేటీ నాగేంద్ర మాట్లాడుతూ బాబాసహెబ్ అంబేద్కర్ స్థాపించిన పార్టీ రాజ్యంగ విలువలతో నడిచే ఏకైక పార్టీ ఆశయాలు నచ్చి పార్టీలో చేరానన్నారు. ఈ కార్యక్రమంలో నవీన్, రమేష్, గంగాధర్, యశ్వంత్ సమీర్, శరత్, రవీంద్ర, నమద్, రాజ, చింటూ కమల్, వెంకటేశ్వర్లు, కె.శ్రీను సయ్యద్ సమద్, ధారా రమేష్, మహిమలూరు శ్రీను, సుబ్రమణ్యం, సంపత్ వలి, గణేష్, వీరందరిని కండువాలతో పార్టీలోకి ఆహ్వానించారు.

## హోరాహోరీగా ఎడ్లబండ్ల పోటీలు



**కోట, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త** కోట మండలం వెంకన్నపాలెం పంచాయతీ పరిధిలోని వీరారెడ్డిసత్రం గ్రామం వద్ద శనివారం శ్రీకామాక్షి సమేత శ్రీమహాలింగేశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వాహక సభ్యులు ఆధ్వర్యంలో ఎడ్లబండ్ల పోటీలు అట్టహాసంగా జరిగాయి. ఎడ్లబండ్ల పోటీలకు కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, గూడూరు మండలాల నుంచి నిర్వాహకులు భారీగా తరలివచ్చారు. ప్రథమ బహుమతి ముల్లు భాస్కర్రెడ్డి 30 వేలు రూపాయలు నగదు ప్రోత్సాహకం అందుకున్నారు. ద్వితీయ బహుమతి రమణయ్య 25 వేలు, తృతీయ బహుమతి గునపాటి చిన్నా 10 వేలు, నాలుగో బహుమతి కోటేశ్వరరావులు అందుకున్నారు. ఈ పోటీలు తిలకించడానికి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమాన్ని కార్యనిర్వాహకులు ముల్లు భాస్కర్రెడ్డి, మల్లికార్జున గౌడ్, కోట భాస్కర్ యాదవ్, ఉలసా పెంచలయ్య యాదవ్, ఆకుత శివశంకర్, కోట బాబు, ప్రసాద్ యాదవ్, పెంచలయ్య యాదవ్, కృష్ణమూర్తి, చైతన్య యాదవ్, భాస్కర్ యాదవ్, కర్లపూడి హరీష్, కృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు.

## వైభవంగా అష్టోత్తర కలిశాభిషేకం పోటెత్తిన భక్తులు



**కోవూరు,ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ దక్షిణాముఖ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో మాఘమాస బహుళ ద్వాదశి పూర్వాషాడ నక్షత్ర శనివారం పర్వదినం సందర్బంగా అష్టోత్తర కలిశాభిషేక పూజా కార్యక్రమాలను సాంప్రదాయబద్దంగా నిర్వహించారు. ప్రాత:కాలమునే స్వామివారికి సుప్రభాతం విశ్వక్సేన పూజ, పుణ్యాహావాచనం కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం 108 కలిశాలకు విశేష పూజలు, మహా పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. రుత్వికులు శ్రీకాంతాచార్యులు అష్టోత్తర కలిశాభిషేక విశిష్టతను భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రుత్వికులు నాగరాజాచార్యులు, రాఘవాచార్యులు, నందకిషోర్ స్వామి, శ్రీరామ్ స్వామి, నారాయణ స్వామి, జయకృష్ణ స్వామి, శ్రావణ కృష్ణ స్వామి, సుదర్శన్ స్వామి, పవన్ స్వామి, ఫణీంద్ర స్వామి, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా కరణం శ్రీనివాసులు, వరలక్ష్మి దంపతులు, కరణం పూర్ణచంద్ర , చందన దంపతులు వ్యవహారించారు.

## మెగా రక్తదాన శిబిరం




**నెల్లూరు,ఫిబ్రవరి14 ప్రభాతవార్త-విద్య** శనివారం నగరంలోని స్థానిక నోవాబ్లడ్బ్యాంక్లో రిఫ్రిజిరే షన్స్ ,ఎయిర్ కండీషనింగ్ వర్కర్స్ అసోసియేష న్వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రక్తదానశిబిరాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మైనారిటీ నాయకులు, మదీనా వాచ్ఏజన్సీస్ అధినేత షేక్ .ఇంతియాజ్ పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్బంగా ఆయనమాట్లాడుతు రక్తదానంపై అందరూ అవగాహన కలిగి ఉండాలని కోరారు. రక్తదానంచేయటం ద్వారా అపదలో ఉన్న ముగ్గురికి ప్రాణదానం చేయవచ్చున్నారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రక్తదానశిబిరాన్ని నిర్వహించటం గర్వకారణమన్నారు.ఈ కార్యక్రమంలో అసోసియేసన్ నిర్వాహకులు వెంకటేశ్వర్లు, షేక్.సర్దార్, సయ్యద్షరీఫ్, నాసిర్, సయ్యద్గయాజ్, సమీర్, జాఫర్, షన్ముకేశ్వరరావు, రాజేష్, తేజ, మరులి తదితరులు పాల్గొన్నారు.